www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 4 అక్టోబర్ 2024 5 పశ్చిమ గోదావరి

సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటాం

ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు

ప్రజాశక్తి - భీమవరం

సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు కె.ఈశ్వర్, టి.ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా ఈనెల 3 నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులుగా ప్రకటించిందన్నారు. జిల్లాలో ఉన్న ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలో క్లాసులపేరుతో విద్యాసంస్థలు నడుపుతున్నారన్నారు. అదేవిధంగా ఎవరైతే విద్యాసంస్థలు నడుపుతారో వారిని ఎస్ఎఫ్ఐ బృందం కచ్చితంగా అడ్డుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రకటించిన సెలవులను అన్ని విద్యాసంస్థలకి ఇవ్వాలన్నారు. ఉల్లంఘించిన విద్యాసంస్థలపైన జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

కొత్త కలెక్టరేట్ నిర్మాణం సాధ్యమేనా..!

అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రస్తుత కలెక్టరేట్

కలెక్టరేట్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కసరత్తు

40 ఎకరాలు అవసరమని ప్రాథమిక అంచనా

ప్రతిపాదనలు సిద్ధం చేసే దిశగా అడుగులు

కలెక్టరేట్ నిర్మాణంపై సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - భీమవరం

ప్రస్తుతం అద్దె భవనంలో కలెక్టరేట్ కార్యకలాపాలు సాగుతున్నాయి. దీంతో కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ప్రతిపాదనలు సిద్ధం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఒకేచోట కార్యాలయాలు ఉండే విధంగా ప్రణాళిక రూపొందించింది. దీనికి సుమారు 40 ఎకరాలు అవసరమని ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే భీమవరంలో ఇంత మొత్తంలో భూమిని సేకరించాలంటే కోట్ల రూపాయలు అవసరం. భీమవరం మార్కెట్ యార్డులో కలెక్టర్ నిర్మాణానికి గత ప్రభుత్వం జిఒ కూడా జారీ చేసింది. ఈ జిఒను రద్దుచేసి కలెక్టరేట్ నిర్మించాలని ఆలోచన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త కలెక్టరేట్ నిర్మాణం సాధ్యమేనా అనేదానిపై తీవ్ర చర్చ సాగుతోంది.

గత వైసిపి ప్రభుత్వం హయాంలో జిల్లాల పునర్విభజన జరిగింది. 2022 ఏప్రిల్ 4న భీమవరం జిల్లా కేంద్రంగా పశ్చిమగోదావరి జిల్లా ఏర్పడింది. ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉంటే ప్రజలకు పరిపాలనాపరంగా సౌకర్యంగా ఉంటుందని వైసిపి ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఈ నిర్మాణం కోసం భీమవరంలో అనువైన స్థలం కోసం జిల్లా ఏర్పాటు ముందు నుంచి అన్వేషణ చేస్తోంది. అయితే కలెక్టరేట్ నిర్మాణ ప్రతిపాదనలు ఆమోదం, నిర్మాణ సమయం పట్టే అవకాశాలున్నా నేపథ్యంలో తాత్కాలికంగా ఏదో వార్డులో ఉన్న శ్రీ చైతన్య ఇంజినీరింగ్ భవన సముదాయంలో అద్దె ప్రాతిపదికన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ ఏర్పాటు చేశారు. అయితే జిల్లాకు తొలి కలెక్టర్గా పి.ప్రశాంతి, రెండో కలెక్టర్గా సుమిత్ కుమార్ బాధ్యతలు నిర్వర్తించారు. మూడో కలెక్టర్గా సి.నాగరాణి నియమితులై బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే కలెక్టరేట్ మాత్రం నాటి నుంచి నేటి వరకూ అద్దె భవనంలోనే కొనసాగుతోంది. దీంతో జిల్లా కేంద్రమైన భీమవరంలో శాశ్వత కలెక్టరేట్ కార్యాలయాన్ని నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. జిల్లా ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అయితే కలెక్టరేట్ నిర్మాణానికి 40 ఎకరాలు అవసరమని ప్రాథమిక అంచనా వేశారు. ఆ దిశగా భూసేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) జిల్లా అధికారులకు ఆదేశించారు.

జిఒ రద్దు చేసే ఆలోచనలో కూటమి ప్రభుత్వం

వైసిపి హయాంలో భీమవరం ఎఎంసి స్థలాన్ని కలెక్టరేట్ కోసం కేటాయించారు. ఉత్తర్వులు కూడా జారీచేశారు. రెవెన్యూ శాఖ మరో అడుగు ముందుగేసి ఆర్అండ్బి శాఖకు బదలాయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అప్పట్లో నిధులు మాత్రం విడుదల చేయలేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయమై ప్రభుత్వం పక్కనపెట్టేసింది. మార్కెట్ కమిటీ స్థలాన్ని ఇచ్చేది లేదంటూ అప్పట్లో మార్కెట్ యార్డ్ పాలకవర్గం కూడా వ్యతిరేకించింది. అప్పటి జిల్లా కలెక్టర్కు లిఖితపూర్వక సమాచారం కూడా ఇచ్చారు. అయితే వైసిపి ప్రభుత్వం మార్కెట్ కమిటీ స్థలాన్ని జిల్లా కలెక్టరేట్కు కేటాయించింది. దీంతో ఎఎంసి ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంపై మార్కెటింగ్ శాఖ తర్జనభర్జనలు పడింది. రెవెన్యూశాఖకే స్థలం చూపించాలంటూ లేఖ రాసింది. అయితే ఇంతవరకూ భీమవరం ఎఎంసి విషయంపై అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేకపోయారు. ఈ క్రమంలో కలెక్టరేట్తోపాటు, జిల్లాకు చెందిన అన్ని ప్రభుత్వ కార్యాలయాలూ ఒకే చోట నిర్మించాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అదే జరిగితే దాదాపు 40 ఎకరాల భూమి అవసరం కానుంది. ప్రస్తుతం కేటాయించిన ఎఎంసిలో 20 ఎకరాల భూమి మాత్రమే ఉంది. కార్యాలయాలన్నీ నిర్మించడానికి ఆ స్థలం సరిపోదు. ఫలితంగా అవసరమైన భూమి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలంటూ జిల్లా కలెక్టర్కు ప్రజాప్రతినిధులు సూచించారు. ఈ నేపథ్యంలో గతంలో ఇచ్చిన జిఒను రద్దు చేసేందుకు కూటమి ప్రభుత్వం ఆలోచన చేసిందని తెలిసింది. ఎంఎల్ఎ అంజిబాబు సైతం కొత్త స్థలాన్ని సేకరించేందుకే మొగ్గుచూపుతున్నారు. దాంతో కలెక్టరేట్ విషయం మళ్లీ చర్చనీయాంశంగా మారింది.

భీమవరం కలెక్టరేట్

కార్యాలయాలన్నీ ఒకేచోట ఏర్పాటుకు చర్యలు

ప్రస్తుతం జిల్లా కార్యాలయాలు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నాయి. అద్దె భవనంలో కలెక్టరేట్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. అందులోనే అత్యధిక జిల్లా కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. డిఆర్డిఎ, ఆర్అండ్బి, ఆర్డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ వంటి కార్యాలయాలు మాత్రమే ఇతర చోట్ల ఉన్నాయి. అద్దె భవనంలో కార్యాలయాలకు సరైన వసతులు లేవు. కలెక్టరేట్ ఏర్పాటు సందర్భంలో ఏలూరు నుంచే ఫర్నీచర్ను ఇక్కడకు తెచ్చుకున్నారు. దాతల సహకారంతో వసతులు ఏర్పాటు చేసుకున్నారు. మరోవైపు కార్యాలయం ఊరికి దూరంగా ఉంది. జనాలు కలెక్టరేట్కు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. దాంతో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉంటే రవాణా సౌకర్యం కల్పించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. కొత్త కలెక్టరేట్ ఆ విధంగా ఏర్పాటు చేయాలని కూటమి నేతలు ఆలోచన చేస్తున్నారు. గతంలో కేటాయించిన ఎఎంసికి రవాణా సౌకర్యం ఉంది. కానీ ఎఎంసిని కొత్తగా ఏర్పాటు చేయడం మళ్లీ కష్టతరమవుతుంది. నియోజకవర్గ పరిధిలోనే ఎఎంసి ఉండాలి. ప్రధాన రహదారులకు అనుకుని ఏర్పాటు చేయాలి. గోదాములు నిర్మించాలంటే అదనంగా నిధులు కేటాయించాలి. ఇవన్నీ సాధ్యమయ్యే పనికాదు. దాంతో కలెక్టరేట్ కొత్తగా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అయితే భీమవరంలో కలెక్టరేట్ నిర్మించాలన్నది పెద్ద సవాల్గా మారింది. భీమవరంలో భూమి విలువ కోట్లకు పడగలెత్తింది. దీంతో 40 ఎకరాలు సేకరించాలన్నది సాధారణ విషయం కాదు. ఈ నేపథ్యంలో నూతన కలెక్టరేట్ నిర్మాణం సాధ్యమేనా అనేదానిపై చర్చ సాగుతుంది.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

గతంలో భీమవరం కలెక్టరేట్కు కేటాయించిన మార్కెట్ యార్డ్ స్థలంలో ఎంపెడా భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్ మార్కెట్ యార్డులోకి తరలిస్తున్నారని జోరుగా ప్రసారం సాగుతోంది. దీనిపై జిల్లా రెవెన్యూ శాఖ ఒక ప్రకటన కూడా ఇటీవల విడుదల చేసింది. మార్కెట్ యార్డులో నిర్మాణంలో ఉన్నది ఎంపెడా భవనం మాత్రమేనని స్పష్టం చేసింది. జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆ భవనంలోకి తరలించడం జరుగుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు తెలిపారు. ఇటువంటి ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని హెచ్చరికలు కూడా జారీ చేయడం జరిగింది. జిల్లా కలెక్టర్ కార్యాలయ నిర్మాణం ఎక్కడ నిర్మించేది ఇంకా నిర్ధారణ కాలేదని, జిల్లా కలెక్టర్ కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేస్తే తెలియజేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇటువంటి ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవని డిఆర్ఒ హెచ్చరించారు.

విశాఖ ఉక్కుప్రయివేటీరణ ఆపాలి

రైతు, వ్యవసాయ, కార్మిక, ప్రజా సంఘాలు హెచ్చరిక

ప్రజాశక్తి - భీమవరం

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదని రైతు వ్యవసాయ కార్మిక పలు ప్రజాసంఘాలు హెచ్చరించాయి. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ పిలుపులో భాగంగా గురువారం స్థానిక ప్రకాశం చౌక్ సెంటర్లో రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దీక్షలు ముగిశాయి. ఈ దీక్షలకు పట్టణ పేదల సంఘం జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు అధ్యక్షుడు వహించారు. ఈ దీక్షలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, అఖిలభారత అగ్రగామిక కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షులు లంకా కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వైవి.ఆనంద్ మాట్లాడారు. 32 మంది ఆంధ్రుల ప్రాణత్యాగంతో నిర్మితమై ఆంధ్రుల హక్కుగా ఉన్న విశాఖ ఉక్కును మోడీ అమ్మాలని చూస్తే ఆంధ్రాలో కూటమి నాయకులకు చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ఎన్నికల ముందు ప్రస్తుత అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి వ్యవహారం చూస్తుంటే ఏరు దాటిన తర్వాత తెప్ప తగలబెట్టిన చందంగా ఉందన్నారు. దీక్షలో పాల్గొన్న టియుసిసి జిల్లా కన్వీనర్ దండు శ్రీనివాసరాజు, రైతు సంఘం నాయకులు చల్లబోయిన వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు పిల్లి కామేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు విశాఖ బుక్కు నష్టాలు వస్తున్నాయని పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం చూస్తే ఇంట్లో ఎలుకలు ఉన్నాయని ఇల్లే తగలబెట్టినట్లు ఉందన్నారు. ఇప్పటికైనా ప్రయివేటీకరణ నిర్ణయాలు ఉపసంహరించుకోవాలని లేకుంటే రానున్న రోజుల్లో ఉద్యమాలను ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలకు సంఘీభావంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు, ఎపి ఎంఎస్ఆర్యు రాష్ట్ర కార్యదర్శి ఎస్.శిరీష్ కుమార్, లాయర్స్ యూనియన్ నాయకులు మల్లుల శ్రీనివాస్, ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు మల్లుల సీతారాం ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఇప్పటికైనా సుప్రీంకోర్టు మొట్టి కాయలతో వాళ్ల ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ అమలుకు ప్రయత్నించాలని హెచ్చరించారు. ఈ దీక్షలో పలు ప్రజా సంఘాల నాయకులు కౌరు శ్రీనివాస్, డి.త్రిమూర్తులు, వేంద్ర సత్యనారాయణ, బి.రమణ, బి.దుర్గాప్రసాద్, బి.వెంకటేశ్వరరావు, కె.వెంకటపతిరాజు, కోట ముత్యాలరావు, యాళ్లబండి నారాయణమూర్తి, తాళ్లూరి రాము, ఎ.అలమహారాజు పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న నేతలు

ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

విశాఖ ఉక్కు అమ్మకాన్ని వ్యతిరేకించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - పెనుగొండ

విశాఖ ఉక్కు అమ్మకాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాలని కోరుతూ కేంద్రం వైఖరి పట్ల టిడిపి, జనసేన, వైసిపిలు ఎందుకు మౌనం పాటిస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ప్రశ్నించారు. గురువారం సిద్ధాంతం గ్రామంలో విశాఖ ఉక్కు ప్రయివేటీరణను వ్యతిరేకించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ర్యాలీ చేసి రావిచెట్టు సెంటర్లో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అధ్యక్షతన జరిగిన సభలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ఆంధ్రుల హక్కుగా ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రజలందరూ ఐక్యంగా పోరాడి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బిజెపి రాష్ట్రానికి ఆయువు పట్టుగా ఉన్న కేంద్ర పరిశ్రమైన విశాఖ ఉక్కును ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందన్నారు. కేంద్రాన్ని ప్రశ్నించాల్సిన రాష్ట్ర పార్టీలు అధికార టిడిపి, జనసేన, ప్రతిపక్ష వైసిపిలు మౌనం వహించడం అన్యాయమన్నారు. రాష్ట్రానికి చెందిన ఏకైక భారీ పరిశ్రమ విశాఖ ఉక్కే అని గుర్తుచేశారు. ఇటీవల కాలంలో 4 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు గేట్పాస్లను రద్దు చేయడమే అందుకు నిదర్శనమన్నారు. అంతేకాకుండా ఉద్యోగులను బలవంతంగా బదిలీ చేయడం తగదన్నారు. ప్రయివేటుపరం చేయడం అని ప్రకటించే కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే ప్లాంట్కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బిజెపి మోసపూరిత విధానాలతో రాష్ట్ర ప్రజలకు ముంపు ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్ర విభజన తర్వాత నష్టపోయిన ఆంధ్రాకు ఇప్పుడు ఏకైక భారీ పరిశ్రమగా ఉన్న విశాఖ స్టీల్ను కూడా అమ్మేయడం అంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు ఉందన్నారు. తక్షణం విశాఖ ఉక్కు అమ్మకాన్ని విరమించుకోవాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. పరిశ్రమను కాపాడుకోవడానికి ప్రజలందరూ మరో చరిత్రాత్మక పోరాటానికి సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్వి గోపాలన్, చింతకాయల బాబూరావు, పివి.ప్రతాప్, కౌరు పెద్దిరాజు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, జిల్లా కమిటీ సభ్యులు సూర్నీడు వెంకటేశ్వరరావు, పుగాకు పూర్ణ, జవ్వాది శ్రీనివాస్, మామిడిశెట్టి రామాంజనేయులు, ముచ్చర్ల త్రిమూర్తులు, సోమరాజు, మండల కమిటీ సభ్యులు షేక్ పాదుషా, కప్పల రత్నంరాజు పాల్గొన్నారు.

హరిబాబుకు సత్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఆరోగ్య విస్తరణ అధికారి గుడాలహరిబాబుని పిహెచ్సి సిబ్బంది ఘనంగా సత్కరించారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతులమీదుగా అవార్డు పొందిన ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబుని సిబ్బంది సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ కష్టపడి పనిచేసే మనస్తత్వంతో హరిబాబు అన్ని కార్యక్రమాలలోనూ ముందుండి ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, పిహెచ్సికి మంచి పేరు తీసుకొస్తున్నారని కొనియాడారు. అనంతరం డాక్టర్ నవ్య జీవన్, డాక్టర్ ప్రతాప్ కుమార్, సిబ్బంది సాలువా, పుష్పమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ పాటబల్ల వెంకటస్వామి, సీనియర్ అసిస్టెంట్ రమేష్ బాబు, పిహెచ్ఎన్ పి.ఎలిజిబెత్, సూపర్వైజర్లు ఎస్కె.అమలేశ్వర రావు, డి.కమల, ల్యాబ్ టెక్నీషియన్లు సిహెచ్.ప్రసాద్, కె.ప్రసాద్, లక్ష్మీనారాయణ, హెల్త్ అసిస్టెంట్లు దివాకర్ బాబు, టి.హరిబాబు, ఎంఎల్హెచ్పిలు సుజిత, గౌతమి, రాజేశ్వరి, స్రవంతి, లికిత, ఎఎన్ఎంలు సుజ్ఞానమని, విజయశాంతి, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.



హరిబాబును సత్కరిస్తున్న పిహెచ్సి సిబ్బంది

విద్యార్థులకు క్రీడా ప్రోత్సాహకం అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నాక్ గ్రేడింగ్ సందర్భంగా గత ఏడాది పాలకొల్లు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కళాశాల అభివృద్ధిలో భాగంగా క్రీడలను ప్రోత్సహిస్తూ రూ.80 వేలతో కళాశాల క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేశారు. విద్యార్థినులకు క్రీడా సామాగ్రిని అందజేసామని, తత్ఫలితంగా విద్యార్థినులు క్రీడల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి తెలిపారు. ఈ వార్తతో ఆనందించామని వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ తటవర్తి సుధాకర్ తెలిపారు. ఇటీవల నరసాపురం వైఎన్ కాలేజీలో నిర్వహించిన జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో ద్వితీయ, షటిల్ పోటీలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థినులను అభినందిస్తూ గురువారం వాకర్స్ క్లబ్ తరపున ప్రత్యేక బహుమతులు అందజేశారు. భవిష్యత్తులో కూడా తమ సహాయ సహకారాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సెక్రటరీ, కోశాధికారి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక విజయ ల్యాబ్ సహకారంతో ఎన్ఎస్ఎస్, జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించారు.

క్రీడా ప్రోత్సాహకాలతో విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు మాంటిస్సోరిస్ విద్యార్థులు

పాలకొల్లు రూరల్ : రాష్ట్రస్థాయి బాస్కెట్బాల్ పోటీలకు ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ విద్యా ర్థులు ఎంపి కయ్యారు. సెప్టెంబర్ 25వ తేదీన ఏలూరులో జరిగిన ఎస్జిఎఫ్ బాస్కెట్బాల్ సెలక్షన్లో బాలికల విభాగంలో జి.రేణుక, 28న మార్టేరులో జరిగిన బాలుర అండర్-14 విభాగంలో టి.ప్రశాంత్, కె.శ్యామ్కిరణ్ సెలెక్ట్ అయ్యారు. వీరు పల్నాడు జిల్లాలో జరగబోయే స్టేట్ టోర్నమెంట్కు పశ్చిమగోదావరి జిల్లా తరపున పోటీలో పాల్గొంటారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్ సెక్రెటరీ, కరస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్, అడ్మినిస్ట్రేటర్, డైరెక్టర్ మద్దాల వాసు, ప్రిన్సిపల్ సామవేదం వసంతలక్ష్మి, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

8 నుంచి రాష్ట్రస్థాయి టెన్నిస్ టోర్నమెంట్స్

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 8, 9 తేదీల్లో పాలకొల్లు కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్లో రాష్ట్రస్థాయి టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్రాజు చెప్పారు. గురువారం టోర్నమెంట్స్ జరిగే ప్రదేశం వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అండర్ 8, 10, 12, 14 సంవత్సరాల బాలురు, బాలికల సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాస్మో, పాలకొల్లు టౌన్ హాల్ సంయుక్త ఆధ్వర్యంలో రుద్రరాజు పద్మరాజు మెమోరియల్ టోర్నమెంట్స్గా వీటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పద్మరాజు టెన్నిస్ క్రీడాకారులుగా, టోర్నమెంట్ నిర్వహణకు విశేష కృషి చేసేవారని అందుకే ఆయన పేరున టోర్నమెంట్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంఘం గౌరవాధ్యక్షులు చెరుకూరి బుద్ధావతారం రాజు పేరున నవంబర్లో జాతీయస్థాయి టెన్నిస్ టోర్నమెంట్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తమ సంఘం పాలకొల్లు నుండి ఉత్తమ క్రీడాకారులను రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ పోటీలకు తయారు చేయాలని సంకల్పంతో గత కొన్ని సంవత్సరాలుగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి వి.వి.సోమరాజు, కోశాధికారి పి.రమేష్బాబు, ఉపాధ్యక్షులు ఆర్.సత్యనారాయణరాజు, సహాయ కార్యదర్శి సూరిబాబు, నిర్వాహకులు గొట్టుముక్కల సూర్య నారాయణ రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భగవాన్రాజు

సౌదీ జైల్లో రామన్నపాలెం యువకుడు

విడిపించాలని కేంద్ర మంత్రికి మాజీ ఎంఎల్ఎ వినతి

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియా వెళ్లి జైలు పాలైన రామన్నపాలెంకి చెందిన యాతం జీవాను స్వదేశానికి తీసుకురావాలని కోరుతూ మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. గురువారం భీమవరంలో సహాయ మంత్రి కార్యాలయంలో మాధవ నాయుడును శ్రీనివాస్ వర్మ కలిశారు. ఈ సందర్భంగా దీనికి సంబంధించిన విషయాలను ఆయనకు తెలిపారు. మొగల్తూరు మండలం, రామన్నపాలెంకు చెందిన యాతం నాగేశ్వరరావు కుమారుడు జీవా అయిదేళ్ల క్రితం బతుకుతెరువు కోసం సౌదీ అరేబియా వెళ్లి డ్రైవర్గా పనిచేశాడు. నాలుగేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం కారణంగా అక్కడి ప్రభుత్వం భారతదేశ కరెన్సీలో సుమారు రూ.50 లక్షలు జరిమానా విధించడం జరిగిందన్నారు. అతని ఆర్థిక పరిస్థితి దృష్ట్యా జరిమానా కట్టలేనందున జీవా సౌదీ ప్రభుత్వం జైల్లో ఉన్నాడు. ఇటీవల నరసాపురం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడుని బాధితుని తండ్రి నాగేశ్వరరావు తన సమస్యను వివరించాడని తెలిపారు. ఈ సమస్యపై స్పందించిన కేంద్ర మంత్రి విదేశీ వ్యవహారాల శాఖకు ఈ సమస్యను తెలిపి సౌదీలో మన ఎంబిసిని సంప్రదించి యాతం జీవా విడుదల అయ్యేలా చర్యలు తీసుకుంటానని శ్రీనివాస్ వర్మ భరోసా ఇచ్చారని మాధవ నాయుడు తెలిపారు.



మంత్రికి వినతిని అందజేస్తున్న మాజీ మంత్రి బండారు

ఫలించిన 'ఆశా'ల ఆందోళన

ఆశావర్కర్ లక్ష్మీమంగ ఉద్యోగంలో కొనసాగుతుంది

ఎంఎల్ఎ చిర్రి బాలరాజు హామీ

మెడికల్ ఆఫీసర్ను ముసునూరు బదిలీ చేసిన డిఎంహెచ్ఒ

ఎంఎల్హెచ్పిపై విచారణకు ఆదేశం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - టి.నర్సాపురం

మండలంలోని టి.నరసాపురం పంచాయతీ పరిధిలో గండిగూడెం గ్రామ ఆశావర్కర్ కాసగాని లక్ష్మీమంగ ఉద్యోగ బాధ్యతల్లో కొనసాగుతుందని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. లక్ష్మీమంగను విధుల నుంచి తొలగించినందుకు నిరసనగా గత ఎనిమిది రోజులుగా ఆశావర్కర్లు యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నారు. ఆశావర్కర్ల రాష్ట్ర నాయకురాలు పోచమ్మ, సిఐటియు జిల్లా నాయకులు ఆర్.లింగరాజు, నాయకుల మద్దతుతో ఆశావర్కర్ల ధర్నా ఉధృతమైంది. ఆశావర్కర్కు అన్యాయం శీర్షికన ప్రజాశక్తిలో వార్త కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా యంత్రాంగం కదిలింది. గురువారం ఆశావర్కర్ల ధర్నా శిబిరాన్ని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, డిఎంహెచ్ఒ సందర్శించి ఆశావర్కర్ల యూనియన్ నాయకురాలు పోచమ్మ, ఆందోళనకారులతో చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యను వారికి వివరించారు. డిఎంహెచ్ఒతో, స్థానిక డాక్టర్తో పంచాయతీ కార్యదర్శితో సమావేశం నిర్వహించి విషయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆశావర్కర్లు మాట్లాడుతూ నెలవారి మీటింగ్ అని చెప్పి సంతకాలు తీసుకుని ఆ సంతకాలను లక్ష్మీమంగను విధులు నుంచి తొలగించడానికి స్థానిక మెడికల్ ఆఫీసర్ ఉపయోగించారని కార్యదర్శి, ఎఎన్ఎంలు ఎంఎల్ఎకు తెలిపారు. ఆశావర్కర్ లక్ష్మీమంగను విధుల నుంచి తొలగించలేదని, ఫిర్యాదులు మాత్రం వచ్చాయని ఎంఎల్ఎకు డిఎంహెచ్ఒ తెలిపారు. అయితే అప్పటికే స్థానికంగా పనిచేస్తున్న మండల వైద్యాధికారి జె.కల్పనారాణిని ముసునూరు బదిలీ చేసినట్లు తెలిపారు. సమస్యపై ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ లక్ష్మీమంగ యథావిధిగా విధులలో కొనసాగుతుందని చెప్పారు. రేపటి నుంచి ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎంఎల్హెచ్పి నాగబాబుపై విచారణకు ఆదేశించారు. కూటమి ప్రభుత్వం చిన్నచిన్న ఉద్యోగులకు అండగా ఉంటుందన్నారు. ఏదైనా ఉంటే కూర్చుని మాట్లాడుకోవాలి తప్ప ఉద్యోగాలు తీసే వరకు రాకూడదన్నారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ల రాష్ట్ర అధ్యక్షులు పోచమ్మ మాట్లాడుతూ న్యాయం పక్కన నిలిచిన ఎంఎల్ఎ బాలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆశావర్కర్లకు ఎవరికి ఇబ్బంది వచ్చినా యూనియన్ అండగా ఉంటుందని, అన్యాయంగా ఎవరిని విధుల నుంచి తొలగించిన ఊరుకునే ప్రసక్తి లేదని తెలిపారు. టి.నర్సాపురంలో రాజకీయ గ్రూపు బేధాల వల్లే ఆమెను ఉద్యోగం నుంచి తీసివేయాలనే ప్రయత్నం చేశారని తెలిపారు. ఆశావర్కర్ లక్ష్మీమంగ విధుల్లో కొనసాగుతోందని ఎంఎల్ఎ, డిఎంహెచ్ఒ చెప్పడంతో ఆశా వర్కర్లు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షులు అడపా నాగరాజు, టిడిపి అధ్యక్షులు నాయుడు రామకృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి, జెడ్పిటిసి మాజీ సభ్యులు నల్లూరి చలపతిరావు, మాజీ సొసైటీ అధ్యక్షులు బొంతు సత్యనారాయణ, బిజెపి నాయకులు చాత్రాతి యుగంధర్, పాలేటి సత్యనారాయణ, కొరివి శేషు, శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఆశావర్కర్లతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి
www.prajasakti.com

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - తణుకు

ఈనెల 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తాడేపల్లిగూడెం డివిజన్ విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి, తణుకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శ్రీనివాస్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తణుకు, తణుకు బైపాస్, పాతవూరు, వేల్పూరు, అత్తిలి, కొమ్మర సబ్ స్టేషన్లో లైన్స్ మరమత్తులు, నిర్వహణ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. తణుకు పట్టణ పరిధిలో బ్యాంక్ కాలనీ, సూర్యాలయం వీధి, సాయి హస్పటల్ ఏరియా, శివాలయం ఏరియా, సంతమార్కెట్ ఏరియా, జపాన్ కాలనీ, ఇరగవరం కాలనీ, రెడ్డి అండ్ రెడ్డి లేఅవుట్, శివబాలాజీ నగర్, లక్ష్మీగణేష్ నగర్, తణుకు రూరల్‌లోని వేల్పూరులో బాలాజీనగర్, రైల్వేస్టేషన్ రోడ్డు, శాలిపేట, విష్ణుప్రియ నగర్, వీరభద్రపురం ఏరియా, అత్తిలి మండల పరిధిలోని అన్ని గ్రామల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. కావున వినియోగదారులందరూ గమనించి సహకరించాలని కోరారు.

నేడు సామూహిక ఎలుకల నిర్మూలన

మండల వ్యవసాయాధికారిణి జ్యోషిలా

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈనెల 4వ తేదీ శుక్రవారం మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాలు, గ్రామ పంచాయతీల వద్ద సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఎ.జ్యోషిలా అన్నారు. గురువారం స్థానిక మండలంలోని మార్టేరు, నెగ్గపూడి గ్రామాలలో వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయి సందర్శనతో పాటు రైతులతో చర్చాగోష్ఠి నిర్వహిస్తూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో వరిపంటపై ఆశించే తెగుళ్లు ముఖ్యంగా బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు గురించి చర్చించారు. వరిపంట ప్రస్తుతం చిరుపొట్ట దశలో ఉందని, రైతులు తప్పకుండా పొటాష్ ఎరువులు ఎకరానికి చివరి దశలో 20 నుంచి 25 కేజీలు వేయాలని, సస్యరక్షణ చర్యలు అవసరం మేరకు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారిని ఎ.జోషిలా రైతులకు వివరించారు. ఈనెల 4వ తేదీ శుక్రవారం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలు, గ్రామ పంచాయతీల వద్ద జరిగే ఈ సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమంలో బ్రో మోడయోలిన్ ఎలుకల మందు, నూకలు, నూనె కలిపినటువంటి విషపు ఎరను రైతులకు ఉచితంగా పంపిణీ చేయబడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని, వరిపంటను ఎలుకల బారి నుంచి కాపాడుకోవాలని వ్యవసాయ అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

కాశీ, అయోధ్య, శబరిమలకు రైళ్లు ప్రవేశపెట్టాలి

కేంద్ర మంత్రికి రైల్వే సభ్యుల వినతి

ప్రజాశక్తి - పాలకొల్లు


కేంద్ర మంత్రికి వినతిని అందజేస్తున్న రైల్వే సభ్యులు

దక్షిణ మధ్య రైల్వే విజయవాడ జోన్ డిఆర్‌యుసిసి సభ్యులు జక్కంపూడి కుమార్ కేంద్ర ఉక్కుశాఖ, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను భీమవరంలో కలిసి ప్రయాణికుల సౌకర్యార్థం పలు ముఖ్యమైన రైళ్లు ప్రవేశ పెట్టాలని వినతి పత్రం అందజేశారు. కాశీ, అయోధ్యలకు అందరికీ అందుబాటులో ఉండే విధంగా నరసాపురం నుంచి ప్రత్యేక రైలు, శబరిమల అయ్యప్ప భక్తుల కోసం స్పెషల్ ట్రెయిన్లు, హైద్రాబాద్‌కు వందేభారత్ స్లీపర్ ట్రెయిన్, బెంగళూరుకు వారానికి రెండుమార్లు రైలుబండి, వ్యాపారస్తులకు, ఉద్యోగులకు, మార్వాడీలకు, అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలన్నారు. చెన్నై టు అహ్మదాబాద్ ట్రెయిన్‌కు నరసాపురం నుంచి విజయవాడలో కనెక్టింగ్ భోగీలు, నరసాపురం నుంచి వైజాగ్‌కు, భీమవరం నుంచి రాజమండ్రికి రద్దు చేసిన ట్రెయిన్లను పునరుద్ధరణ చేయాలని కోరారు. అరుణాచలం వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్భంగా కాకినాడ నుంచి చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా వెళ్లిపురంలో దిగి ప్రత్యామ్నాయ ప్రయాణ మార్గాలు వెతుక్కుని, అక్కడ ప్రాంతీయ భాష రాక భక్తులు మోసపోవచ్చన్నారు. ప్రయాణం కష్టతరంగా మారిందని, ఈ ట్రెయిన్‌ను తిరువణ్ణామలై పొడిగించాలని, నరసాపురం నుంచి వెళ్లే అన్ని ట్రెయిన్లు చాలా పాత పడిపోవడం వల్ల ప్రయాణికులు అనేక ఇక్కట్లు గురవుతున్నారన్నారు. కాబట్టి నరసాపురం నుంచి వెళ్లే ప్రతి ట్రెయిన్ కొత్తవాటిగా మార్చాలనే అంశాలతో వినతి పత్రంలో సమర్పించారు. మంత్రి శ్రీనివాస వర్మ సానుకూలంగా స్పందించి వెంటనే వినతి పత్రంలో పొందుపరిచిన అంశాలను చర్చించడానికి శుక్రవారం విజయవాడ డిఆర్ఎం నరేంద్ర పాటిల్‌ని కలవనున్నారని కుమార్ తెలిపారు.

వరిపంటలో జాగ్రత్తలు తీసుకోవాలి

'పొలం పిలుస్తోంది'లో ఎఒ ప్రియాంక

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రస్తుత దశలో వరిని బ్యాక్టీరియాతో ఆకు ఎండు తెగులు ఆశిస్తోందని, ఈ దశలో రైతు నత్రజని ఎరువు వినియోగిస్తే చేనుకు నష్టం కలుగుతుందని, యూరియా వంటి నత్రజని వాడొద్దని ఎఒ ప్రియాంక తెలిపారు. ప్రభుత్వం ప్రారంభించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక గ్రామ సచివాలయ భవనంలో వ్యవసాయ శాఖ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రియాంక రైతులకు పలు సూచనలను చేశారు. పొటాష్ ఎరువులు ఎకరానికి 20 కేజీలు వేసుకోవాలన్నారు. తెగుళ్ల వ్యాప్తిని అరికట్టడానికి కోసైడ్ ఒక లీటరు నీటిలో రెండు గ్రాములు, అదే లీటర్ నీటిలో ప్లాంటమైసిన్ ఒక గ్రాము మందు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ రకంగా ఎకరానికి 200 లీటర్లు చొప్పున పిచికారీ చేయాలన్నారు. లేదా ప్లాంటమైసిన్ తో ట్రై బేసిక్ కాపర్ సల్ఫేట్ మందును రెండు గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయవచ్చన్నారు. ఈ సమావేశంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ కె.భార్గవి సత్య, మాజీ గ్రామ సర్పంచి కనుమూరు రామకృష్ణంరాజు, మండల మాజీ ఉపాధ్యక్షులు నౌకొట్ల రామారావు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు భారతి, పలువురు రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - కాళ్ల

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాళ్లకూరు గ్రామంలో స్వయంభూ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తాడినాడకు చెందిన వేగేశ్న వెంకట సూర్య సత్యనారాయణ రాజు, సూర్యలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో అదిలక్ష్మి అమ్మవారి అలంకరణ నిర్వహించారు. శ్రీలక్ష్మీ అమ్మవారు ఆదిలక్ష్మి అమ్మవారి అలంకరణలో యాత్రికులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే యాత్రికులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ఇఒ మోకా అరుణ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గురువారం పులిహోర, క్షీరాన్నం పంపిణీ చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మొదట రోజు అమ్మవారిని బాల త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి మోకా అరుణ్ కుమార్, చైర్మన్ కడలి మాణిక్యాలరావుల ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. యాత్రికులకు ఎటువంటి సౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాటు చేశారు.

అగ్ని ప్రమాదంలో రేకుల షెడ్డు దగ్ధం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని పెదమామిడిపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పరువు ఘటోత్కచుడు రేకుల షెడ్డు అగ్నికి ఆహుతైంది. సుమారు రెండు లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. ఫైర్ ఆఫీసర్ వైవి జానకీరామ్ సిబ్బందితో వెళ్లి మంటలను పక్క ఇళ్లకు వెళ్లకుండా నిరోధించారు. ఇంటిలోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. ఘటోత్కచుడు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు.

మావుళ్లమ్మకు బంగారం విరాళం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

శ్రీమావుళ్ళమ్మ అమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన మన్నే శ్రీనివాసరావు 6 గ్రాముల బంగారం కానుకగా గురువారం ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్‌కు అందించారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మ శ్రీమద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

వసతి గృహాలు.. సమస్యలకు నిలయాలు

- శిథిలావస్థలో వసతిగృహాలు
- పెచ్చులూడుతున్న స్లాబ్
- వానొస్తే లోపలికి చేరుతున్న మురుగునీరు
- బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం : కొణితివాడలో పగిలిన వంట షెడ్డుపై కప్పు

ప్రభుత్వ వసతి గృహాల పరిస్థితి అధ్వానంగా ఉంది. పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మండలంలోని వసతిగృహాల దుస్థితిని పట్టించుకునే నాథుడే కరువవ్వడంతో అందులో చేరిన విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతం. గతంలో అండలూరు, మత్స్యపురి, వీరవాసరం, కొణితివాడలలో ఉన్న కొన్ని వసతిగృహాలు మూతపడగా కొణితివాడ బాలికలు, వీరవాసరం, రాయకుదురు బాలుర వసతి గృహాలు కొనసాగుతున్నాయి. కొణితివాడ బాలికల

కాళ్ల : శిథిలావస్థకు ఎస్‌సి బాయ్స్ హాస్టల్

వసతిగృహంలో ఇరవై ఎనిమిది మంది, వీరవాసరం బాలుర వసతి గృహంలో నలభై ఐదు మంది కొనసాగుతున్నారు. వీటిలో కొణితివాడ బాలిక వసతిగృహం పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. వర్షం వస్తే డ్రెయిన్ మురుగునీరు వసతిగృహంలోకి వస్తుంది. పెచ్చులూడుతున్న భవనంలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఎప్పుడు శ్లాబ్ నుంచి పెచ్చులూడి మీదపడతాయోనంటూ బాలికలు ఆందోళన చెందుతున్నారు. బాలికలకు అత్యవసరమైన మరుగుదొడ్ల తలుపులు అంతంతమాత్రంగానే ఉండటంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ విషసర్పాలు సంచరించే విధంగా అక్కడ పరిస్థితి నెలకొంది. ఇటీవల కాలంలో వసతిగృహాలను అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. వసతిగృహాలలో విద్యార్థులు ఉంటున్నారన్న ఆలోచనే ఉన్నతాధికారులకు లేనట్టుగా అక్కడ నెలకొన్న దర్భర పరిస్థితులను బట్టి తెలుస్తుంది. మరమ్మతుల నిర్వహణ సైతం విస్మరించడంతో దెయ్యాల భవనంలా దర్శనమిస్తున్నాయి. లోతట్టు ప్రాంతంలో భవనం ఉండటం, నేలపైన నిద్రించాల్సి ఉండటంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. తప్పని పరిస్థితులలో వసతి గృహాలలో చేరవలసిన పరిస్థితుల మధ్య భీమవరం, గణపవరం, రేలంగి, దొంగపిండి వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. అటువంటి విద్యార్థులు చేరిన వసతిగృహాల పట్ల ప్రభుత్వాధికారులు చిన్నచూపు చూడటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణమే వసతిగృహాలను ప్రక్షాళన చేయాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ఇదిలా ఉంటే వీరవాసరం బిసి బాలుర వసతిగృహానికి సొంత భవనం లేకపోవడం గమనార్హం. మండల కేంద్రంలో ఉన్న ఈ వసతిగృహంలో విద్యార్థులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి విద్యనభ్యసిస్తున్నారు. అయితే జాతీయ రహదారి పక్కనే ఈ అద్దె భవనం ఉండటం వల్ల నిత్యం వాహనాల రాకపోకల శబ్దాలతో విద్యార్థులు సౌండు పొల్యూషన్‌కు లోనవుతున్నారు. దీంతో ప్రశాంతంగా చదువుకునే పరిస్థితి ఇక్కడ కానరావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వసతిగృహాల అభివృద్ధికి ఇక్కడ ఉంటున్న విద్యార్థులకు సదుపాయాలు, ప్రశాంతమైన వాతావరణం కలిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో ఎస్‌సి బాయ్స్ హాస్టల్..
బిసి బాలికల ఇంటిగ్రేడ్ హాస్టల్‌లో నిర్వహణ

కాళ్ల : నిరుపేద విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు వసతి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేసింది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణా లోపంతో సంక్షేమ వసతిగృహాలు సమస్యలకు నిలయంగా మారాయి. మండలకేంద్రమైన కాళ్లలో దశాబ్దాల క్రితం నిర్మించిన వసతిగృహం శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారింది. కాళ్ల బాలుర ఎస్‌సి సాంఘిక సంక్షేమ వసతిగృహం శిథిలావస్థకు చేరడంతో తప్పని పరిస్థితిల్లో కాళ్ల బాలికల బిసి ఇంటి గ్రేడ్ హాస్టల్‌లో నిర్వహిస్తున్నారు. ఆకివీడు, గుమ్ములూరు, కలవపూడి, తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి ఈ హాస్టల్లో విద్యనభ్యసిస్తున్నారు. 3వ తరగతి నుంచి 10వ తరగతిలో 40 మంది విద్యార్థులు ఈ వసతిగృహంలో ఉన్నారు. నాలుగు నెలల నుంచి కాస్మోటిక్ చార్జీలు చెల్లించడం లేదు. వసతిగృహ పరిస్థితిపై స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టలేదు. దీంతో బాలికల హాస్టల్‌లో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన వసతిగృహం నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇటీవల బిల్డింగ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించామని హాస్టల్ వార్డెన్ ఎ.శ్రీకాంత్ తెలిపారు.

వ్యవసాయ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

పెనుమంట్ర : ఆచార్య ఎన్‌జి రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ విద్యా విస్తృత వ్యాప్తికి గుంటూరు, లాం ఫారం సార్వత్రిక, దూర విద్యా కోర్సులను ప్రారంభిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దూరవిద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఎంతో మంది రైతులు, మహిళలు, యువతతో పాటు, ఆసక్తి కలిగిన వారు వ్యవసాయ విద్యను పొందేలా దూరవిద్య ద్వార వ్యవసాయ సర్టిఫికేట్ కోర్సులను ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సర్టిఫికేట్ కోర్సుల ద్వారా రైతులకు కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని, తరగతుల ద్వారా, ప్రయోగ కార్యక్రమాల ద్వారా అందించి వారి నైపుణ్యతను మెరుగుపరిచి, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు కావలసిన సామర్థ్యాన్ని అభివృద్ధి చేసేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈనెల నుంచి ప్రారంభం కానున్న ఆన్‌లైన్ సర్టిఫికేట్ కోర్సులు చిరుధాన్యాలు, సేంద్రియ ఎరువులు, వర్మికంపోస్ట్ తయారీ, తేనెటీగల పెంపకం మీద 8 వారలు(2 నెలల) వ్యవధిలో నిర్వహించబడుతుందని, ఆసక్తి ఉన్నవారు ఒక్కొక్క కోర్సుకు రూ.1,500 చొప్పున ఫీజు చెల్లించి కోర్సుకు నమోదు చేసుకోవాలని తెలిపారు. నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్ సదుపాయం(కంప్యూటర్, ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్, ఐపాడ్) కలిగి ఉండాలన్నారు. ఈ సర్టిఫికేట్ కోర్సులు చేయుటకు ఆసక్తికలవారు తమ పేర్లను ఈనెల 15వ తేదీ లోపు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం:8008788776, 8309626619, 8096085560లను సంప్రదించాలని తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ఉండి : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని సన్‌రైజ్ ఫౌండేషన్ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు వాణి అన్నారు. గురువారం వైసిపి సీనియర్ నాయకులు కొత్తపల్లి రమేష్ రాజు జన్మదినోత్సవం సందర్భంగా ఉండి మండలం మహదేవపట్నం గ్రామంలోని సన్‌రైజ్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో కొత్తపల్లి రమేష్ రాజు పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జన్మదిన వేడుకలను, పెళ్లిరోజు వేడుకలను వృద్ధాశ్రమాలలో నిర్వహించడం వల్ల ఇటువంటి వృద్ధులకు కడుపునిండా అన్నం పెట్టిన వారవుతారని వారు సూచించారు. గత మూడు సంవత్సరాలుగా రమేష్ రాజు పుట్టినరోజు వేడుకలను అభిమానులు తమ వృద్ధాశ్రమంలో చేయడం అభినందనీయమని, ఇటువంటి జన్మదిన వేడుకలను రమేష్ రాజు మరిన్ని జరుపుకోవాలని వృద్ధాశ్రమంలోని వృద్ధులు ఆశీర్వదించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి రమేష్ రాజు, అభిమానులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా రాజకిషోర్

ప్రజాశక్తి - మొగల్తూరు

తహశీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

మొగల్తూరు తహశీల్దార్‌గా కె.రాజ కిషోర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ నియమితులైన సిహెచ్.విద్యాపతి తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు బదిలీపై వెళ్లారు. ఎన్‌టిఆర్ జిల్లా వీరులపాడు నుంచి మొగల్తూరు బదిలీపై రాజ కిషోర్ వచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ నరేష్ బాబు, మండల సర్వేయర్ ధనంజయ, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాలు, పంచాయతీలలో గురువారం గ్రామసభలు సర్పంచుల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ చట్టంలో గ్రామాలలో నిర్వహించవలసిన పనుల గుర్తింపుపై చర్చించారు. తొందర్లోనే వాటి ఆమోదానికి మరో గ్రామసభ నిర్వహించనున్నామని తెలిపారు. ఆయా గ్రామసభలలో ఉపాధి హామీ టిఎ జె.వెంకటేశ్వరరావు, సర్పంచులు పడవల మేరీ సత్యనారాయణ, బందుల ఎలేషా, అందే వెంకటలక్ష్మి దొరబాబు, కడలి సోంబాబు, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని నత్తా రామేశ్వర గ్రామంలోని వైసిపి నాయకుడు కర్రి రామలింగేశ్వర రెడ్డి భార్య సాయి వెంకట లక్ష్మీకాంతం ఇటీవల మృతి చెందారు. ఈమేరకు గురువారం మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగ నాథరాజు వారి నివాస గృహంలో నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయన వెంట మండల, స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో బస్‌పాస్‌ల జారీ కౌంటర్లు పనిచేయవు

ఆర్‌టిసి డిపో మేనేజర్ సుబ్బన్నరెడ్డి

నరసాపురం : ఆర్‌టిసి బస్టాండ్‌లో బస్‌పాస్ జారీ కౌంటర్లు ఈనెల 5, 6వ తేదీల్లో పనిచేయవని నరసాపురం ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. సాఫ్ట్‌వేర్ అప్డేట్ కారణంగా రెండురోజుల పాటు కౌంటర్లను మూస్తున్నామని చెప్పారు. మళ్లీ 7వ తేదీ సోమవారం నుంచి కౌంటర్లు యధావిధిగా పనిచేస్తాయని, గమనించాలని విజ్ఞప్తి చేశారు.

భవానీమాలతో స్కూల్‌కు వచ్చిన విద్యార్థి

పరీక్ష రాసేందుకు అనుమతి లేదన్న యాజమాన్యం

తల్లిదండ్రుల ఆందోళన

నరసాపురం : పట్టణంలోని రాయపేటలో జెసికిలి ప్రయివేట్ విద్యాసంస్థ భవానీమాల వేసి స్కూల్‌కు వచ్చిన విద్యార్థిని గురువారం పరీక్ష రాసేందుకు అనుమతించలేదు. దీంతో విద్యార్థిని బంధువులు, హిందూ ధార్మిక సభ్యులతో స్కూల్ వద్ద ఆందోళన చేశారు. దీంతో గంట పాటు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. శరన్నవరాత్రులు ఆరంభం కావడంతో ఆరోవ తరగతి చదువుతున్న విద్యార్థి మాల ధరించి స్కూల్‌కు వచ్చాడు. చివరి పరీక్ష కావడంతో రాసి వెళదామని వచ్చిన ఆ విద్యార్థిని సిబ్బంది అనుమతించ లేదు. యూనిఫాం వేసుకొని రావాలని కోరారు. తల్లితండ్రులు విషయం చెప్పినప్పటికీ అనుమతించలేదు. దీంతో వారు ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న హిందూ ధార్మిక సంఘాల సభ్యులు అక్కడికి చేరుకుని ధర్నా చేశారు. చివరికి స్కూల్ యాజమాన్యం జోక్యం చేసుకుని విద్యార్థి కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పి, మరోసారి ఇలా జరగకుండా చూస్తామని హామీ ఇచ్చి విద్యార్థిని పరీక్షకు అనుమతించారు.

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి

ఉండి : నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. విజయదశమి నవరాత్రుల్లో మొదటి రోజైన గురువారం మండలంలోని ఉనుదుర్రు గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రుల పూజా కార్యక్రమంలో కనుమూరి రఘురామకృష్ణరాజు, ఇందిరాదేవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, రైతులందరూ పాడి పంటలతో, భోగభాగ్యాలతో జీవించాలని, అమ్మవారి అనుగ్రహంతో నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని అన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోను దేవి నవరాత్రులను ఘనంగా ప్రారంభించారు.

పాస్ పోర్ట్ పోయినది

నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం (ముస్కెపాలెం) గ్రామం కు చెందిన గొలుసు మావుళ్ళమ్మ అను నేను ది:25/09/2024, బుధవారం రోజున వీసా నిమిత్తం పాలకొల్లులోని మా బంధువుల ఇంటికి వెళ్ళే సమయంలో పాలకొల్లు బస్సు స్టాండ్ దగ్గర వైజాగ్‌లో ది: 28/01/2021లో పొందిన U7328047 పాస్ పోర్ట్ పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికిన నాకు అందచేయవలసినదిగా కోరి ప్రార్థిస్తున్నాను.

నా అడ్రస్ : గొలుసు మావుళ్ళమ్మ, W/o.ఏసు
D.No.4-44, ముస్కెపాలెం,
లక్ష్మణేశ్వరం, నరసాపురం మండలం,
ప. గో.జిల్లా, Ap, pin-534275,
సెల్ నెం. 9603362279.

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపసల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No.188/2024, O.S.No.85/2024

పిటీషనర్లు:
1) కొనాల అహారోను
2) కొనాల సుగంధరత్నం

రెస్పాండెంట్లు:
1) కాటికి రత్న కుమారి
2) కాటికి సీమెను, తండ్రి: ఇస్మాయేలు, చినపేట, దిరుసుమర్రు, భీమవరం మండలం.
3) కాటికి రోబోను

పిటీషనర్లు, రెస్పాండెంట్లుపైన కోర్టు వారి ఎదుట దాఖలు చేసిన Permenent Injuction దావాలో రెస్పాండెంట్లకు దావా పర్యవసానములు తేలు వరకు Temporary Injucion కోరి ఐ.ఎ.నెం.188/2024 పిటీషనులో 2వ రెస్పాండెంటుకు వాదన ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట **ది.28-10-2024వ తేదీ పగలు గం॥10:30 ని॥లకు హాజరు కావలెను.** లేని ఎడల మీ పరోక్షమందు పిటీషనరుల పక్షం ఉత్తర్వులు జారీ కాబడును.

మందరపు వెంకటాచారి
వాదుల తరపు అడ్వకేట్,
భీమవరం.
భీమవరం,
03-10-24. సెల్: 98485 02377

In The Court Of The 7th Addl. District Judge :: Eluru (Family Court)

I.A.No.500/2022, I.A.No.919/2015
A.S.No.236/2008

Between:
Manam Subhash Chandra Bose (Died) And Others.
Proposed Party: Manam Radhika
...Petitioner /Appellant
AND
Chilakalapudi Sambasiva Rao, S/o. Veerabhadra Rao, Cultivation, Jagannadha puram (V), Pedavegi (M), Eluru District.
...Respondent

కోర్టు ప్రకటన

పై నెంబరు గల ఐ.ఎ.నెం. 500/2022లో రెస్పాండెంటు గారికి ఎన్నిసార్లు కోర్టు నోటీసులు పంపినా పుచ్చుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు నోటీసులు అమలు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసినారు. కావున పై వారికి ఏమయినా ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట **ది.23-10-2024వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు హాజరు కావలెను.** లేనిచో మీ పరోక్షమున తీర్పు చెప్పనబడును.

Sri NEKKARGANTI NARASHIMA RAO
Advocates, Eluru.
Eluru,
03-10-24. Cell: 98481 18984

మహారాజశ్రీ జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 94/2022

1. శ్రీమతి యండపల్లి అరుణ -వాది

Vs

1. శ్రీ కుక్కల తిరుమల వెంకట శ్రీనివాస్ -ప్రతివాది

ప్రతివాది అడ్రస్: శ్రీ కుక్కల తిరుమల వెంకట శ్రీనివాస్, S/o. రామారావు, వయస్సు 54 సం॥లు, టీచర్, డో.నెం. 2-13-9, గాంధీ నగర్, వంగాయిగూడెం గ్రామం, ఏలూరు రూరల్ మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

వాది పై నంబరు దావా బాకీ రాబట్టుకొనుటకు ప్రతివాదిపై దాఖలు చేయటమైనది. ప్రతివాదికి పై నెంబరు దావాలో ఎన్ని పర్యాయములు కోర్టు వారి ద్వారా మరియు రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీసులు పంపుతున్నప్పటికి అందలి విషయములు తెలుసుకుని ఏదో కారణం చెప్పి కావాలని నోటీసులు తీసుకొనకుండా బుద్ధిపూర్వకముగా కాలయాపన చేయుచున్నారు. కనుక శ్రీ కోర్టు వారు ప్రతివాదిపై అమలు జరగవలసిన నోటీసులు ప్రజాశక్తి పేపరు ప్రకటనల ద్వారా తెలియచేయుటకు వాదికి అనుమతి జారీ చేసినారు. కనుక, ప్రతివాది పై O.S. No. 94/2022 నంబరు దావాలో వ్యక్తిగతంగా గాని, న్యాయవాది ద్వారా గాని **ది. 18-10-2024వ సంవత్సరం తేదీన ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట హాజరై అభ్యంతరములు ఏమైనా ఉన్న ఎడల తెలియచేయవలెనని, లేని ఎడల ప్రతివాది పై పరోక్షముగా తదుపరి చర్యలు శ్రీ కోర్టు వారు జరిపించవలసి ఉండునని ఇందుమూలముగా ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియచేయటమైనది.

వాయిదా తేది: 18-10-2024

నిమ్మగడ్డ పుల్లారావు, న్యాయవాది
కొవ్వూరు, సెల్: 79979 45148

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P. No.4/2020 in OS.No.95/2009

నెక్కంటి వెంకటరమణరావు ...డిక్రీ హోల్డర్
Vs
జక్కంశెట్టి కేశవరావు ...జడ్జిమెంట్ డేటార్ టు

జక్కంశెట్టి కేశవరావు, S/o.మావుళ్ళు,
డో.నెం. 9-64, జక్కంశెట్టివారి పాలెం
H/o.కొడమంచిలి, ఆచంట మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు E.P. గ్రంధములో జడ్జిమెంట్ డేటార్ యొక్క ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది. 18-10-2024 వ తేదీన ఉ.గం.10-30 ని.ల లగాయతు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసిన వారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూలు

1. పశ్చిమ గోదావరి జిల్లా, ఆచంట సబ్-రిజిస్ట్రారులో చేరిన కొడమంచిలి గ్రామంలో గల ఆర్.ఎస్.నెం.286/9 లో గల య. 1.04 సెంట్లులో గల భూమి దానిలో గల మంగులూరు టైల్డ్ షెడ్‌నకు హద్దులు:
తూర్పు : జక్కంశెట్టి కేశవరావు గారి స్థలం
పడమర : బాల నాగ కృష్ణవేణి గారి స్థలం
దక్షిణము: జక్కంశెట్టి కేశవరావు గారి స్థలం
ఉత్తరం: కోడేరు, మార్టేరు ఆర్ & బి రోడ్
అమీన్ విలువ రూ.10,00,000/-లు
డి.హెచ్.ఆర్.విలువ రూ. 2,00,000/-

2. పశ్చిమ గోదావరి జిల్లా, ఆచంట సబ్-రిజిస్ట్రారులో చేరిన కొడమంచిలి గ్రామంలో 360 చ.గ. స్థలము అందులో ఆర్.సి.సి. రూఫ్ బిల్డింగ్, డో.నెం. 964/ఎ & అసెస్మెంట్ నెంబర్ : 1331 నకు హద్దులు:
తూర్పు : ఇరిగేషన్ బోదె
పడమర : ఇరిగేషన్ బోదె
దక్షిణము: రెస్పాండెంట్ యొక్క గార్డెన్ ల్యాండ్
ఉత్తరం: కోడేరు, మార్టేరు ఆర్ & బి రోడ్.
అమీన్ విలువ రూ.6,00,000/-లు
డి.హెచ్.ఆర్. విలువ రూ.2,00,000/-లు
(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

పాలకొల్లు **యం.వెంకట రామిరెడ్డి**
ది.04-10-2024 అడ్వకేటు

NAME CHANGE

I ***NIMMAKANTI ROHINI (Old Name)*** same as in my passport, Residing at D.No.2-154, Sowbhagya Lakshmi Nagar, Satrampadu, Pedapadu Mandal, Vatluru, Eluru Rural, West Godavari District, Andhra Pradesh 534007, here by declare that I have changed my name as ***ELURU ROHINI (New Name)*** Aadhar No.6808 1569 8730, W/o ELURU SESHA MAHESH BABU.

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపసల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.85/2024

వాదులు:
1) కొనాల అహారోను
2) కొనాల సుగంధరత్నం

ప్రతివాదులు:
1) కాటికి రత్న కుమారి
2) కాటికి సీమెను, తండ్రి: ఇస్మాయేలు, చినపేట, దిరుసుమర్రు, భీమవరం మండలం.
3) కాటికి రోబోను

వాదులు ప్రతివాదులపైన కోర్టు వారి ఎదుట దాఖలు చేసిన వాదులు దావా షెడ్యూలు ఆస్థులపై స్వాధీన హక్కుభుక్తములకు Permenent Injuction కోరి దాఖలు చేసిన దావాలో 2వ ప్రతివాది వాదన ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట **ది.28-10-2024వ తేదీ పగలు గం॥10:30 ని॥లకు హాజరు కావలెను.** లేని ఎడల మీ పరోక్షమందు వాదుల పక్షం ఉత్తర్వులు కాబడును.

మందరపు వెంకటాచారి
వాదుల తరపు అడ్వకేట్,
భీమవరం.
భీమవరం,
03-10-24. సెల్: 98485 02377

మహారాజశ్రీ సివిల్ జడ్జి కోర్టు (సీనియర్ డివిజన్) భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా

O.S.No.59/2024

వాది: చిక్కాల సత్యనారాయణ,
వేంకటేశ్వరరావు, డోరునెం.19-25-2,
రెడ్డికాలనీ, భీమవరం,
భీమవరం మండలం, ప.గో.జిల్లా.
ప్రతివాది: నల్లం వటపత్రసాయి,
S/o.రామారావు, నల్లం వారి వీధి, 13వ వార్డు, డోరునెం.13-20-23/2, గునిపూడి,
భీమవరం, భీమవరం మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు దావాలో మీకు కోర్టు నుండి నోటీసులు పంపినను ప్రతివాది అయిన మీకు అందని దరిమిళా శ్రీకోర్టు వారు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసులు వేసియున్నారు. పై నెంబరు దావా ది.17-10-2024 తేదీన వాయిదా అయివున్నది. కావున మీరు ఉదయం 10.30 గంటలకు కోర్టు వారు ముందు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి మీ వాదనను వినిపించవలసినది లేని యెడల మీ పరోక్షము నందు మీకు వ్యతిరేకముగా విచారణ జరుగును.

వాయిదా తేది: 17-10-24

వాది తరుపు న్యాయవాదులు
ఎన్.వి.పి.శేషసాయి, కె.బి.రాజశేఖర్,
అడ్వకేట్స్, భీమవరం.

మహారాజశ్రీ సివిల్ జడ్జి కోర్టు (సీనియర్ డివిజన్) భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా.

I.A.1755/2024
in O.S.No.59/2024

పిటీషనర్/వాది:
చిక్కాల సత్యనారాయణ, S/o.వేంకటేశ్వరరావు, డోరునెం.19-25-2, రెడ్డికాలనీ, భీమవరం, భీమవరం మండలం, ప.గో.జిల్లా.
ప్రతివాది: నల్లం వటపత్రసాయి,
S/o.రామారావు, నల్లం వారి వీధి, 13వ వార్డు, డోరునెం.13-20-23/2, గునిపూడి, భీమవరం, భీమవరం మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు పిటిషన్/దావాలో కోర్టు నుండి మీకు నోటీసులు పంపినను Respondent / Defendant అయిన మీకు అందని దరిమిళా శ్రీకోర్టు వారు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసులు వేసియున్నారు. పై నెంబరు పిటిషన్/దావా ది.17-10-2024 తేదీన వాయిదా అయివున్నది. కావున మీరు ఉదయం 10.30 గంటలకు కోర్టు వారు ముందు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి మీ వాదనను వినిపించవలసినది లేని యెడల మీ పరోక్షము నందు మీకు వ్యతిరేకముగా విచారణ జరుగును. పై నెంబరు పిటిషను పిటిషనర్ ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని తోడ జప్తు చేయమని కోరుచూ దాఖలు చేశారు. కావున ఈనోటీసు లగాయితు మీరు 48 గంటలలో 3rd party Security ఇవ్వవలెను. లేనిఎడల పరోక్షంగా తోడజప్తు చేయబడును.

షెడ్యూల్

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, గునుపూడి సబ్‌డివిజన్‌లో చేరిన భీమవరం మున్సిపల్ ఏరియాలోని గునుపూడి గ్రామం తాలూకు గల జిరాయితీ పల్లం రి.స.నెం.359/1రు య.0-19ట్లు ఆరు పోర్షన్లు గల పెంకుటి యిల్లుకు హద్దులు :
తూర్పు: నర్సాపురం-భీమవరం రోడ్డు
దక్షిణం:ముచ్చర్ల రామమూర్తి గారి యిల్లు స్థలం
పడమర: మున్సిపల్ రోడ్డు
ఉత్తరం: మురుగు డ్రయిన్
యీ హద్దుల మధ్య య.0-19 ట్లు లేక చ.గ.919.6 లుకు చ.మీ 768.93ర్లు స్థలమున్ను యిందలి డోర్‌నెం.13-20-23/2-6రు గల ఆరు పోర్షన్లు గల పెంకుటి యిల్లున్ను దీనిని అంటియున్న యావత్తు కలపి సామానుయున్న దీనికి బిగించియున్న కరెంటు సర్వీసులుయున్ను, వైరింగ్ మెటీరియల్ యున్నూ వాటర్ ట్యాప్‌యున్నూ యిందలి యావత్తు యీజుమెంట్ హక్కులు, మార్గహక్కులున్నూ సహా..

వాయిదా తేది: 17-10-24

పిటీషనర్ తరుపు న్యాయవాదులు
ఎన్.వి.పి.శేషసాయి, కె.బి.రాజశేఖర్,
అడ్వకేట్స్, భీమవరం.